## కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జూలూరుపాడు, డిసెంబర్ 3 : వైరా నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన మాలోత్ రాందాస్‌నాయక్ గెలుపు పట్ల ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రం జూలూరుపాడులో కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ పార్టీలు చంద్రుగొండ క్రాస్‌రోడ్ నుంచి స్థానిక పోలీస్‌స్టేషన్ వరకు పటాకులు కాలుస్తూ ర్యాలీ నిర్వహించారు.

## దేవాలయాల్లో పూజలు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 3: మండలంలోని జానకీపురం సత్యమ్మ తల్లి, బూర్గుగూడెం ముత్యాలమ్మ తల్లి ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించారు.

## ఆలయంలో చోరీ



పాల్వంచ, డిసెంబర్ 3 : పాల్వంచ–కొత్తగూడెం జాతీయ రహదారిలో ఉన్న శ్రీ లక్ష్మీనర్సిహస్వామి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. తెల్లవారుజామున దొంగలు పడి అమ్మవారి నగ, హుండీలోని డబ్బులు అపహరించుకుపోయారు. సుమారు రూ.3 లక్షల విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. ఆలయ నిర్వాహకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దివ్యాంగులను ప్రోత్సహించాలి

రెబ్బెన, డిసెంబర్ 3: దివ్యాంగులను అందరు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్ లోని సీఈఆర్ క్లబ్ లో ఆదివారం రోజున అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ను ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జీఎం బహుమతులు అందించి మాట్లాడుతు దివ్యాంగులను ఎవరు కుడ చిన్నచుపు చుడవద్దని వారిని అందరు ప్రోత్సహించి వాళ్ల కాళ్ల మీద వారు నిలబడువిధంగా సహకారం అందించాలని సూచించారు. దివ్యాంగుల్లోని శక్తిని బయటకు తీసి ప్రోత్సహించాలని సూచించారు. ఏజీఎం తిరుమల్‌రావు, ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సుజాత వెంకటేశ్వర్లు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఇల్లెందులో కోరం కనకయ్య, అశ్వారావుపేటలో జారే ఆదినారాయణ గెలిచారు

ఇల్లెందు, డిసెంబర్ 3: ఇల్లెందు అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య, తన సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియపై 56,196 ఓట్ల మెజార్టీ తో గెలుపొందారు. పాల్వంచలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం ఓట్లను లెక్కించారు. నియోజకవర్గంలో మొత్తం 2,19,569 ఓట్లకుగాను 1,76,840 పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం 2,075కుగాను కోరం కనకయ్యకు 1,582, బానోత్ హరిప్రియకు 402, ఇతరులకు 191 పోలయ్యాయి. వీటిని కలుపుకుని కోరం కనకయ్యకు 1,08,316 ఓట్లు, బానోత్ హరిప్రియకు 52,120 ఓట్లు, 18 మంది స్వతంత్ర అభ్యర్థులకు కలిపి 16,404 ఓట్లు పోలయ్యాయి. మొదటి నుంచి చివరి రౌండ్ వరకు కనకయ్యకు ఆధిక్యత కనిపించింది.

**గత ఎన్నికల్లోనూ వీరిద్దరే..**

2014, 2018 ఎన్నికల్లోనూ బానోత్ హరిప్రియ, కోరం కనకయ్య తలపడ్డారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కోరం కనకయ్య, టీడీపీ నుంచి బానోత్ హరిప్రియ పోటీ చేశారు. సుమారు 10వేల ఓట్ల మెజార్టీతో కోరం కనకయ్య గెలుపొందారు. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆయన టీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లారు. బానోత్ హరిప్రియ కూడా టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి హరిప్రియ, టీఆర్‌ఎస్ నుంచి కనకయ్య పోటీకి దిగారు. ఆనాడు నియోజకవర్గంలో మొత్తం 1,96,798 ఓట్లు ఉన్నాయి. వీటిలో 1,64,523 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి బానోత్ హరిప్రియకు 70,644 ఓట్లు, టీఆర్‌ఎస్ అభ్యర్థి కోరం కనకయ్యకు 67,757 ఓట్లు వచ్చాయి. 2,887 ఓట్ల మెజార్టీతో హరిప్రియ గెలిచారు. ఆనాడు పోటీ చేసిన 14మంది స్వతంత్ర అభ్యర్థులకు మొత్తం 26,122 ఓట్లు వచ్చాయి.

అశ్వారావుపేట, డిసెంబర్ 3: అశ్వారావుపేట అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జారే ఆదినారాయణ వి జయం సాధించారు. మొత్తం ఓట్లు 1,55,961కుగాను 1,35,501 పోలయ్యాయి. జారే ఆదినారాయణకు 74,420 ఓట్లు, సమీప బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నా గేశ్వరరావుకు 45,963 ఓట్లు పోలయ్యాయి. 28,457 ఓట్ల మెజారిటీతో ఆదినారాయణ గెలిచారు. సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్‌కు 2,483, బీజేపీ మద్దతుతో పోటీ చేసిన జనసేన అభ్యర్థి ముయ్యబోయిన ఉమాదేవికి 2,274, ప్రజాపంథా అభ్యర్థి కిషోర్ కల్లూరికి 1,906, బీఎస్పీ అభ్యర్థి మడకం ప్రసాద్‌కు 1,578, స్వతంత్ర అభ్యర్థులు ఊరే రవికి 855, కన్నెబోయిన వెంకటనర్సయ్యకు 177, పద్దం వెంకటరమణకు 1,752, మ సు గొండ వెంకటముత్యంకు 676, ఆంగోతు కృష్ణకు 231, ఊకే ముక్తేశ్వరరావుకు 418, కుంజా నాగమణికి 484, తంబళ్ళ రవికి 922, నోటాకు 1,362 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 14 రౌండ్లతో, పోస్టల్ బ్యాలెట్‌లో జారే ఆదినారాయణ ఆధిక్యత ప్రదర్శించారు. తనను గెలిపించిన ఓటర్లకు, శ్రమించిన కాంగ్రెస్ శ్రేణులకు జారే ఆదినారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధికి, ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యమిస్తానని అన్నారు. తనకు ఓటు వే సిన ప్రజలకు, బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆ పార్టీ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

**గత ఎన్నికల్లో ఇలా...**

నియోజకవర్గ ఓటర్లు ప్రతి ఎన్నికల్లోనూ వినూత్న రీతిలో తీర్పునిస్తున్నారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వగ్గెల మిత్రసేనను, 2014 ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీ అభ్యర్థి తాటి వెంకటేశ్వర్లును, 2018లో కాంగ్రెస్ మద్దతుతో టీడీపీ నుంచి పోటీ చేసిన మెచ్చా నాగేశ్వరరావును గెలిపించారు.

# రైతుల గుండెల్లో 'తుఫాన్'



ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు



ధాన్యం పరదాలు కప్పుతున్న రైతులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 3: రైతుల గుండెల్లో 'తుఫాను' రేగుతున్నది. అలజడి సృష్టిస్తున్నది. కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే కోతకు వచ్చిన వరి పంటను యంత్రంతో కోయిస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. పొలంలోని ధాన్యాన్ని మెరక ప్రదేశానికి తరలించి పరదాలు కప్పుతున్నారు. వర్షం కురిస్తే తమ పంట దెబ్బతింటుందేమోనని పత్తి, పొగాకు రైతులు కూడా భయపడుతున్నారు.

చంద్రుగొండ, డిసెంబర్ 3: భారీ వర్షం ఉంటుందన్న హెచ్చరికలు, వాతావరణ మార్పులతో వరి, పత్తి రైతుల గుండెల్లో దడ మొదలైంది. యంత్రంతో వరి కోసేందుకు వారం రోజులు పడుతుంది. ఈలోగా భారీ వర్షం కురిస్తే.. చేతికొచ్చిన పంటంతా దెబ్బతింటుందేమోనని రైతులు భయపడుతున్నారు.



ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



యంత్రంతో వరి కోత

## ఒకే ఊరి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు..!

దమ్మపేట రూరల్, డిసెంబర్ 3: ఒకే ఊరికి చెందిన ఆ ఇద్దరూ ఎమ్మెల్యేలుగా గెలిచారు..! ఒకరు.. ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు. మరొకరు.. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. వీరిద్దరి స్వగ్రామం.. దమ్మపేట మండలంలోని గండుగులపల్లి. తమ ఊరి నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారని ఆ గ్రామస్తులు ఆనందభరితులవుతున్నారు.

## అసెంబ్లీకి తొలిసారిగా ఇద్దరు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): జిల్లా నుంచి తొలిసారిగా ఇద్దరు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లబోతున్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు ఇదే తొలి గెలుపు. వీరిద్దరూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఇద్దరూ ఈసారి గెలిచారు.

## సీపీఐ నుంచి ఒకే ఒక్కరు

రాష్ట్రంలో సీపీఐ నుంచి ఒకే ఒక్కరు కొత్తగూడెం నుంచి పోటీ చేశారు–గెలిచారు. కొత్తగూడెం నుంచి ఆ పార్టీ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు రెండోసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కూనంనేని.. సమీప ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి జలగం వెంకటరావుపై గెలిచారు.

# పాల్వంచలో భారీ బందోబస్తు





పాల్వంచలో బందోబస్తు దృశ్యాలు

పాల్వంచ, డిసెంబర్ 3 : అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పాల్వంచలో ఆదివారం పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఓట్ల కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. కిన్నెరసాని వెళ్లే రహదారిని బ్లాక్ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కేటీపీఎస్ అల్లూరి సెంటర్ నుంచి కరకవాగు గ్రామానికి వెళ్లే రహదారిని పూర్తిగా మూసివేశారు. ఇతరులెవ్వరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మీడియా, కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, అధికారులకు మాత్రమే అనుమతిచ్చారు. అడుగడుగునా పోలీసులు మోహరించి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఉదయం ఆరుగంటల నుంచే పోలీసులు రహదారిని దిగ్బంధనం చేశారు. అనుమానితులను ఎవరినీ దరిదాపుల్లో ఉండనీయకుండా చూశారు. కేఎస్‌పీ రోడ్డుకు అనుబంధంగా ఉన్న రహదారులు సీతారాంపట్నం, గట్టాయిగూడెం, కరకవాగు నుంచి వచ్చే పెట్రోల్ బంక్ ఏరియాల్లో పోలీసులు ఎక్కడికక్కడే మోహరించారు. ఎన్నికల ఫలితాలు ప్రారంభమైన సమయం దగ్గర నుంచి సాయంత్రం వరకు పార్టీల అభ్యర్థులు గెలిచిన వారి తరపున వచ్చే కార్యకర్తలు, నాయకులు ఎవరినీ ఆ ప్రాంతాలకు రానీయకుండా అల్లూరిసెంటర్‌లోనే అడ్డుకున్నారు. అల్లూరి సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసిన పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున వాహనాల్లో తరలివచ్చి గెలిచిన వారిని ర్యాలీగా తోడ్కొని వెళ్లారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయి అధికారికంగా ప్రకటించిన అనంతరం బయటికి వచ్చిన తర్వాత అల్లూరిసెంటర్ నుంచి సంబురాల్లో మునిగితేలారు. పాల్వంచ పట్టణంలో జాతీయ రహదారితోపాటు మిగిలిన రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.





పాల్వంచలో బందోబస్తు దృశ్యాలు